సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 5 । మే । 2023



రాజన్న సన్నిధిలో నర్సింహ జయంతి

వేములవాడ: నర్సింహాస్వామి జయంతి సందర్భంగా రాజన్న ఆలయంలోని కోటిలింగాల ప్రాకారంలో ఆలయ అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రాజన్నకు సెలవుల రద్దీ

వేములవాడ: రాజన్నను గురువారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సభ్యులతో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

వెళ్లిన పదిరోజులకే..

- తొలి ప్రయత్నంలో జాబ్ కొట్టిన అనిల్
- అందరితో కలివిడిగా ఉంటాడని పేరు
- అనిల్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం
- దీనంగా మృతుడి కుమారులు
- ఇంటికి భారీగా చేరుకున్న బంధువులు



అనిల్ ఇంటి వద్ద స్నేహితులు



మల్కాపూర్‌లోని అనిల్ ఇంటి వద్ద విషాదంలో బంధువులు



భార్య సౌజన్య, పిల్లలతో అనిల్

బోయినపల్లి(చొప్పదండి): జమ్మూకాశ్మీర్‌లో నదిలో హెలికాప్టర్ కూలి మండలంలోని మల్కాపూర్‌కు చెందిన ఆర్మీ జవాన్ పబ్బాల అనిల్ (29) మృతి చెందాడన్న విషయం మండలంలో దావనంలా వ్యాపించింది. గ్రామానికి చెందిన పబ్బాల మల్లయ్య, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. అనిల్ పదో తరగతి గంగాధరలో, ఇంటర్ కరీంనగర్‌లో పూర్తి చేశాడు. డిగ్రీ చదువుకున్న అనిల్ సుమారు 11 ఏళ్ల క్రితం ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొని తొలి ప్రయత్నంలోనే జాబ్ సాధించాడు. ఆయన ప్రస్తుతం జమ్మూకాశ్మీర్‌లో ఆర్మీ సీఎఫ్ఎన్ విభాగంలో ఏవీఎన్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగంలో చేరిన రెండేళ్లకు కోరెం గ్రామానికి చెందిన సౌజన్యతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు అయాన్ (6), అరయ్ (3) సంతానం. తన అత్తగారి ఊరైన కోరెంలో ఇటీవల బీరప్ప పట్నాలు వేసుకోగా.. ఆ కార్యక్రమానికి అనిల్ హాజరయ్యాడు. అందరితో కలిసి సుమారు పది రోజుల పాటు ఆనందంగా గడిపాడు.

కుమారుడి పుట్టిన రోజు వేడుకలు

40 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన అనిల్.. ఇటీవలే చిన్న కుమారుడు అరయ్ మూడో పుట్టిన రోజును నిర్వహించాడు. తండ్రిని ఆసుపత్రిలో చూపించాడు. పదిరోజుల క్రితం తిరిగి విధులకు బయల్దేరాడు. అంతలోనే అనుకోని ప్రమాదం జరిగి మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఇదే ఘటనలో హెలికాప్టర్‌లో ఉన్న మరో ఇద్దరు కూడా మృతిచెందినట్లు సమాచారం.

బాధిత కుటుంబానికి 'బండి', 'బోయినపల్లి' పరామర్శ

అనిల్ మృతిచెందిన విషయం తెలుసుకున్న కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఫోన్‌లో మాట్లాడారు. అనిల్ కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతుడి కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతిమసంస్కారాలకు ఏర్పాట్లు చూడాలని స్థానిక నాయకులకు సూచించారు. అనిల్ మృతి పట్ల రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సంతాపం ప్రకటించారు.

అనిల్‌కు ఇద్దరు సోదరులు (శ్రీనివాస్, మహేందర్) ఉన్నారు. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. తల్లి లక్ష్మి గతంలో గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. తండ్రి మల్లయ్య ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నాడు. అనిల్ మరణవార్త తెలుసుకున్న బంధువులు, స్నేహితులు ఆయన ఇంటికి భారీగా చేరుకున్నారు. తల్లి ఏడుస్తుంటే ఏమీ తెలియని ఆ చిన్నారులు బిక్కుబిక్కుమంటూ చూస్తుండడం పలువురిని కంటతడి పెట్టించింది.

ఆర్మీకి వెళ్లాలని అనిల్ కోరిక

అనిల్‌కంటే ముందు గ్రామానికి చెందిన మెట్ట కుమార్ మొదట ఆర్మీలో చేరాడు. మరోవ్యక్తి అకెన అనిల్ కూడా ఆర్మీలో చేరడంతో ఎలాగైనా ఆర్మీలో చేరాలని అనిల్ భావించాడు. అనిల్‌కు చిన్నప్పటి నుంచే సైనికుడిని కావాలనే కోరిక ఉండేదని ఆయన సోదరుడు శ్రీనివాస్ చెప్పాడు.

న్యూస్‌రీల్

తడగొండ వెంకన్న పారివేట శోభాయాత్ర



స్వామివారి పారివేట శోభాయాత్ర

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండ శ్రీవేంకటేశ్వరస్వామి పంచాహ్నిక కల్యాణంలో భాగంగా గురువారం రాత్రి స్వామివారి పారివేట శోభాయాత్ర ఉత్సాహంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో భజనలు, భక్తి గీతాలతో ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు కల్వకుంట్ల మోహనకృష్ణాచార్యులు, శ్రీకాంతాచార్యులు, సాయిశర్మ తదితరులు ఉన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత



బాధితుడికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్సై

తంగళ్లపల్లి: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఓ బాధితుడికి సీఈఐఆర్ యాప్ ద్వారా గుర్తించి గురువారం తిరిగి అందించారు. తంగళ్లపల్లి ఎస్సై పి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీఈఐఆర్ (సెంట్రల్ ఏక్విప్మెంట్ ఏడెంటిటీ రిజిష్టర్) అప్లికేషన్ ద్వారా పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన ఫోన్లను గుర్తించడం చాలా సులభమని, బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే గుర్తిస్తామని తెలిపారు. వేములవాడకు చెందిన నాగుల దేవేందర్ ఏప్రిల్ 15న తాడూర్ చౌరస్తా వద్ద తన ఫోన్‌ను పోగొట్టుకోగా సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా సిరిసిల్లలో ఉన్నట్లు గుర్తించి బాధితుడికి అందించామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కార్తీక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

8, 15, 18 తేదీల్లో సదరం శిబిరాలు

సిరిసిల్ల: జిల్లాకేంద్ర ఆస్పత్రిలో ఈనెల 8, 15, 18 తేదీల్లో సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రావు తెలిపారు. 8న మానసిక దివ్యాంగులు, 15న కంటిచూపు, వినికిడి లోపం ఉన్నవారు, 18న ఎముకలకు సంబంధించి శిబిరాలు ఉంటాయని, దివ్యాంగులు మీసేవ ద్వారా పొందిన స్లాట్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, మెడికల్ డాక్యుమెంట్లు, ఫోన్ నంబరుతో హాజరుకావాలని కోరారు.

స్పెషల్ బ్రాంచ్ ఆరా..!

సాక్షి స్పందన

వేములవాడ: వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో నలుగురు నిర్వాసితులను నమ్మించి మోసం చేసిన వైనంపై 'సాక్షి'లో ఈనెల 4న 'నమ్మించి.. కాజేసి' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా స్పెషల్ బ్రాంచ్ విభాగం గురువారం ఆరా తీసింది. ఓ వ్యక్తి పలువురు అమాయకుల ప్లాట్లను తన బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్న వైనంపై బాధితులు, స్థానికుల నుంచి సమాచారం తెప్పించుకున్నట్లు తెలిసింది.

కంటివెలుగులో 3,915 మందికి పరీక్షలు

సిరిసిల్ల: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా 3,915 మందికి కంటి పరీక్షలు చేశారు. 755 మందికి రీడింగ్ కళ్లద్దాలు, 544 మందికి పాయింట్ అద్దాలు అందించారు.

గీత కార్మికుల సంక్షేమమే లక్ష్యం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండల కేంద్రంలో గౌడసంఘం కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. గీత కార్మికులకు బీమా సౌకర్యం కల్పించిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్‌దే అన్నారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, నాయకులు రమేశ్, సుధాకర్, శ్రీనివాస్, బాలయ్య, నర్సాగౌడ్, దత్తాద్రిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా నృసింహుడి కల్యాణం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న అనుబంధం నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం శ్రీభూనీలాసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. రాజన్న ఆలయం నుంచి పట్టువస్త్రాలను ఆలయ ఈవో కృష్ణప్రసాద్ అందించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తదితరులు దర్శించుకున్నారు.

పేపర్ లీకేజీలు ప్రభుత్వ వైఫల్యమే..



మాట్లాడుతున్న దొమ్మాటి సాంబయ్య

సిరిసిల్లటౌన్: పరీక్షల పేపర్ల లీకేజీ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ఠ అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి దొమ్మాటి సాంబయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ, ఎస్సెస్సీ, ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించలేని దుస్థితిలో సర్కారు ఉందన్నారు. నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులపై నిర్లక్ష్యం చేస్తోందని, నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. పారదర్శకత లేని పాలనపై నిరుద్యోగులు, యువత తిరుగుబావుటా ఎగుర వేస్తున్నారని, వారికి సంఘీభావంగా ఈనెల 8న హైదరాబాద్‌లో నిరుద్యోగ జంగ్‌సైరన్ సభను కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ హాజరవుతున్నారని తెలిపారు. ప్రజలు, నాయకులు, కార్మికులు, కర్షకులు, యువత హాజరుకావాలని కోరారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు కామిని వనిత, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ వినియోగించుకోండి



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: వేసవి సెలవులు వృథా చేయకుండా సిరిసిల్ల ప్రోగ్రెసివ్ టీచర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని డీఈవో రమేశ్ కుమార్ అన్నారు. స్థానిక శివనగర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. చేతిరాతపై పట్టు సాధిస్తే వార్షిక పరీక్షల్లో మంచి గ్రేడ్ సొంతం చేసుకోవచ్చన్నారు. అబాకస్, బేసిక్ మ్యాథ్స్ వినియోగించుకోవాలన్నారు. సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తు రవీందర్, బండి ఉపేందర్, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ దేవరాజు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ మల్లారపు పురుషోత్తం, సలహాదారులు తాళ్లపల్లి శ్రీధర్, రాఘవేందర్, ఉపాధ్యక్షుడు బాలా గౌడ్, కార్యదర్శి లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ భగీరథ నీరు అందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- మిషన్ భగీరథ శుద్ధి జలకేంద్రం పరిశీలన



జలకేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వేములవాడఅర్బన్: జిల్లా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతిఇంటికీ మిషన్ భగీరథ నీరు అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. వేములవాడ మండలం అగ్రహారంలోని మిషన్ భగీరథ శుద్ధి జలకేంద్రాన్ని గురువారం పరిశీలించారు. పంపింగ్ సామర్థ్యం, స్టోరేజీ వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జలకేంద్రం నుంచి ప్రతిరోజూ నీరు సరఫరా అయ్యేలా మిషన్ భగీరథ ఇంజినీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నాణ్యతను రోజుకు నాలుగుసార్లు పరిశీలించాలన్నారు. అనంతరం రగుడులో మున్సిపల్ ఆధ్వర్యంలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు. సిరిసిల్ల పట్టణ ప్రజల అవసరాలకు సరిపడా తాగునీటిని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈనెల చివరి నాటికి పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ కార్యనిర్వాహక ఇంజినీర్లు విజయ్ కుమార్, జానకి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి పీహెచ్‌సీకి 'ఎన్‌క్వాస్'



తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గురువారం కేంద్రప్రభుత్వం ద్వారా ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్) సర్టిఫికెట్ వచ్చింది. పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు రావడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాలోని పీహెచ్‌సీల్లో అధునాతన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల వేములవాడ, పీఎస్‌నగర్, కోనరావుపేట పీహెచ్‌సీలకూ సర్టిఫికేషన్ వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. జిల్లాలో వైద్య ప్రమాణాలు మెరుగుపడ్డాయనడానికి ఇది నిదర్శనమని తెలిపారు. ఈ గుర్తింపు మూడేళ్లు ఉంటుందన్నారు. ఓపీ, ఐపీ, సర్జికల్ వంటి అన్ని విభాగాల్లో నాణ్యత పెరిగిందని, తంగళ్లపల్లి పీహెచ్‌సీలో ఫిజియోథెరపీ సేవలూ అందుబాటులోకి తెచ్చామని కలెక్టర్ తెలిపారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ మాట్లాడుతూ ఎన్‌క్వాస్ సర్టిఫికేషన్ రావడం సంతోషంగా ఉందన్నారు.

బేగంపేట పబ్లిక్ స్కూల్‌కు విద్యార్థిని ఎంపిక



డ్రా తీస్తున్న అధికారులు

సిరిసిల్ల: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2023–2024 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి పారదర్శకంగా విద్యార్థిని ఎంపిక చేశారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ సమక్షంలో గురువారం లాటరీ పద్ధతిన డ్రా తీశారు. బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో (ఇంగ్లిష్ మీడియం) ప్రవేశానికి జిల్లాకు ఒక్క సీటు కేటాయించారు. ఆ సీటు కోసం డ్రా తీయగా ఇల్లంతకుంట మండలం నర్సక్కపేటకు చెందిన ర్యాగటి సుహాస ఎంపికైంది. వెయిటింగ్ లిస్ట్‌లో ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన బొడ్డు మణిదీప్, ఎల్లారెడ్డిపేటకు చెందిన అంతెరువుల ఆద్య ఉన్నారు. ఎస్సీ అభివృద్ధి అధికారి పి.మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వేదనలు.. రోదనలు..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న వికలాంగుడి పేరు మహ్మద్ ఖాసీం. గ్రామం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి. ఏడేళ్ల క్రితం ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి. అప్పటినుంచి అతని భార్య ఫర్వీన్ ఆయనతో గొడవపడి 23 ఏళ్ల కుమారుడితో ఇంటినుంచి వెళ్లి పోయింది. ఖాసీం రెండేళ్ల క్రితం పక్షవాతంబారిన పడ్డాడు. అలనాపాలన చూసేవారు లేక నరకం అనుభవిస్తున్నట్లు పోలీసుల ఎదుట బోరున విలపించాడు. తన భార్య, కుమారుడిని రప్పించి న్యాయం చేయాలని వేడుకున్నాడు.



తన భర్త చిత్రహింసలు పెడుతున్నాడని, వేధింపుల నుంచి కాపాడి కాపురం నిలబెట్టాలని ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన శనిగరపు సౌందర్య పోలీసులను వేడుకుంది. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన శనిగరపు జీవన్‌తో 2017లో వివాహం జరిగిందని, శారీరకంగా, మానసికంగా వేధించడంతో సిరిసిల్ల కోర్టులో కేసు వేశానని, అయితే కేసు ఉపసంహరించుకోవాలని భర్తతోపాటు మరిది, తోటికోడలు, అత్త ఫోన్‌లో వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఎస్పీ ముందు విలపించింది.



ఈ ఫొటోలో ఉన్న వివాహిత తాళ్లపల్లి రోజా. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామం. ఇదే గ్రామానికి చెందిన తాళ్లపల్లి అభినేష్‌తో 15 నెలల క్రితం వివాహం జరిగింది. కొద్దికాలం కాపురంచేశాక.. వేరేవ్యక్తితో వివాహేతర సంబంధం అంటగట్టి కాపురానికి తీసుకెళ్లడం లేదు. ప్రస్తుతం పుట్టింట్లోనే ఉంటోంది. 'ఎస్పీ సారూ.. కాళ్లమొక్కుతా నా కాపురం నిలబెట్టాలి..' అని రోజా వేడుకుంది. భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్సైని ఎస్పీ ఆదేశించారు.



ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌కు చెందిన ఉప్పుల లత అనే మహిళ భూ సమస్యను పరిష్కరించాలని ఎస్పీని కలిసి గోడు వెళ్లబోసుకుంది. గ్రామ శివారులోని సర్వే నంబర్ 385లో 20 గుంటల భూమిని సాగు చేసుకుంటున్నానని, అదే గ్రామానికి చెందిన పంతులుగారి రాజం, రేణ, మల్లయ్య, శామవ్వ, శంకర్ తమ భూమిని ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వేడుకుంది. సమస్యను పరిష్కరించకుంటే చావే శరణ్యమని విలపించింది.

- పోలీసుల ఎదుట కన్నీటి పర్యంతం
- ఠాణాదివస్‌కు స్పందన
- భార్యాభర్తల ఎడబాటు, భూవివాదాలే అధికం
- ప్రజల నుంచి వినతులు స్వీకరణ
- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఠాణా దివస్
- ఎస్పీ అఖిల్ మహాజన్
- ప్రజల నుంచి 112 ఫిర్యాదులు



హాజరైన బాధితులు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో మొదటిసారి ఏర్పాటు చేసిన ఠాణాదివస్‌కు బాధితులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివిధ సమస్యలపై 112 మంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఒక్కొక్కరూ ఒక్కో సమస్యతో కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసుల ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఠాణాదివస్ ఏర్పాటు చేశామని, ప్రజలకు మరింత చేరువ కావడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారం కోసం అధికారులను ఆదేశించామన్నారు. కుటుంబ సంబంధిత సమస్యలు షీటీం, సఖీసెంటర్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని వివరించారు. శాంతిభద్రతలు కాపాడడానికి పోలీసుశాఖ సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. యువత గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ విశ్వప్రసాద్, సీఐ మొగిలి, ఎస్సై శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : ఆపద సమయంలో ఆసరాగా ఉండేందుకు ఉపాధ్యాయ సంక్షేమనిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ పేర్కొన్నారు. కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లాస్థాయి సమావేశంలో కుటుంబ సంక్షేమ నిధి కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, జిల్లా కార్యదర్శులు ఆడెపు శివ, వంగ మల్లేశం, జంగిటి రాజు, కొత్వాల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



దీక్షా శిబిరంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మాజీ మంత్రి సుద్దాల దేవయ్య గురువారం సంఘీభావం ప్రకటించారు. నాలుగేళ్లుగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కల్చరల్ : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంధుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం గురువారం తెలిపారు. 1వ తరగతి నుంచి 5 వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం, 1నుంచి పదో తరగతి వరకు తెలుగు మీడియంలో బోధన ఉంటుందన్నారు. ప్రవేశాలు పొందే విద్యార్థులు ఆరేళ్ల నుంచి 14 ఏళ్లలోపు వయస్సు, సదరం సర్టిఫికెట్ ఉండాలని సూచించారు. ఆసక్తిగల బాలబాలికల ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9494317315 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

ముస్తాబాద్ : మండలంలోని పోతుగల్‌లో గురువారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గంగమ్మ ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా గంగపుత్రులు పోచమ్మ తల్లికి బోనాలు తీశారు. డప్పుచప్పుళ్ల, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

'అనువంశిక అర్చకులకే అవకాశం కల్పించాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ : రాజన్న ఆలయంలో ఖాళీగా ఉన్న అర్చక పోస్టుల భర్తీలో అనువంశిక అర్చక కుటుంబాలకే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబును గురువారం అనువంశిక అర్చక సంఘం నాయకులు కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు రాజన్న, కృష్ణమూర్తి, మధు రాధాకిషన్, సాంబశివుడు, సంతోష్, నాగేంద్రశర్మ, ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర శర్మ, ప్రధాన అర్చకులు ఉమేశ్ శర్మ, చంద్రగిరి శరత్‌శర్మ తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాలు

సిరిసిల్లకల్చరల్ : జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సహాయ ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ విద్యనభ్యసిస్తూ వార్షిక ఆదాయం రూ.2 లక్షల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళా విద్యార్థినులు మాత్రమే ఈ ఉపకరణాలు తీసుకునేందుకు అర్హులన్నారు. రెట్రో ఫిట్టెడ్, మోటోరైజెడ్ వెహికల్స్, ల్యాప్‌ట్యాప్, బ్యాటరీ వీల్ చైర్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కుళ్లిన శరీర భాగం లభ్యం

మల్యాల: మండలంలోని ముత్యంపేట శివారు దిగువ కొండగట్టు వద్ద రైల్వే ట్రాక్ సమీపంలో కుళ్లిన శరీరం భాగం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మంచిర్యాల రైల్వే పోలీసులకు సమాచారం అందించగా రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. శరీర భాగంపై బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 9490871784, 9949304574 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

15 నుంచి పల్లెల్లో క్రీడా పండుగ

- చీఫ్ మినిస్టర్స్ కప్‌–2023 పేరిట పోటీలు
- మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు..
- నిర్వహణకు నిధులు, కమిటీలు
- 15 నుంచి 36 ఏళ్ల వయస్సు వారు అర్హులు



మల్యాపూర్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్: చాలా ఏళ్ల తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా సంబరం నెలకొననుంది. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం చీఫ్ మినిస్టర్స్ కప్‌–2023 పేరిట క్రీడా పండుగకు శ్రీకారం చుట్టారు. పోటీల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవలే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ సంబంధిత ఫైలుపై తొలి సంతకం చేశారు. అనంతరం పోటీల నోటిఫికేషన్ విడుదలైంది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడలు సజావుగా సాగేందుకు కమిటీలను వేసి, నిధులు సైతం విడుదల చేశారు. 15 నుంచి 36 ఏళ్ల వయసువారు అర్హులు.

మండల స్థాయిలో 5 క్రీడాంశాలు..

మండల స్థాయిలో జరిగే పోటీలకు ఎంపీపీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఎంపీడీవో మెంబర్ కన్వీనర్‌గా, జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈవో లేదా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎస్సై, మున్సిపల్ కమిషనర్, పీడీ లేదా పీఈటీలు సభ్యులుగా వ్యవహరిస్తారు. పోటీల నిర్వహణకుగాను రూ.15 వేలు మంజూరు చేశారు. 5 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పురుషులకు ఫుట్‌బాల్ పోటీలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరగనున్నాయి.

జిల్లా స్థాయిలో 11..

జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఐపీఎస్ అధికారి, కో–వైస్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీ), కన్వీనర్‌గా జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి, సభ్యులుగా ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, డీఈవో, ఇండస్ట్రీస్ జీఎం, మున్సిపల్ కమిషనర్ వ్యవహరిస్తారు. పోటీల నిర్వహణకు రూ.75 వేలు మంజూరయ్యాయి. 11 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్‌తో పాటు పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరగనున్నాయి.

రాష్ట్ర స్థాయిలో 18..

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాశాఖ మంత్రి చైర్మన్‌గా, శాట్స్ చైర్మన్ కో–చైర్మన్‌గా, ప్రిన్సిపల్ సెక్రటరీ వైస్ చైర్మన్‌గా, శాట్స్ ఎండీ కన్వీనర్‌గా, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షులు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కమిషనర్ మున్సిపల్, కమిషనర్ పంచాయతీరాజ్, కమిషనర్ జీహెచ్ఎంసీ, డిప్యూటీ డైరెక్టర్లు సభ్యులుగా వ్యవహరిస్తారు. 18 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్, షూటింగ్, టేబుల్‌టెన్నిస్‌తోపాటు పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్నాయి.

నగదు బహుమతి..

రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతి ఇవ్వనున్నారు. వ్యక్తిగత విభాగంలో మొదటి స్థానానికి రూ.20 వేలు, ద్వితీయ స్థానానికి రూ.15 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు ఇస్తారు. టీం విభాగంలో మొదటి స్థానానికి రూ.లక్ష, ద్వితీయ స్థానానికి రూ.75 వేలు, తృతీయ స్థానానికి రూ.50 వేలు ఇవ్వనున్నారు.

గ్రామీణ క్రీడాకారులకు వరం



సీఎం కప్ క్రీడా పోటీలు గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు వరం. రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండల, జిల్లా స్థాయిలో క్రీడలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇక్కడ రాణించిన క్రీడాకారులకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయి.

– కీర్తి రాజవీరు, డీవైఎస్‌వో, కరీంనగర్, చీఫ్ మినిస్టర్స్ కప్ కన్వీనర్

యువత సద్వినియోగం చేసుకోవాలి



పల్లె క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉంది. వేసవి సెలవుల్లో క్రీడా సందడి మొదలుకానుంది. యువత ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి.

– నందెల్లి మహిపాల్, ఒలింపిక్ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, కప్‌నిర్వాహక సభ్యుడు

విజయదుందుబి మోగించాలి



చాలా రోజుల తర్వాత గ్రామీణ స్థాయి నుంచి జరుగుతున్న క్రీడా పోటీలతో పల్లెల్లో క్రీడా పండుగ వాతావరణం నెలకొననుంది. క్రీడాకారులు మండల, జిల్లా స్థాయి పోటీలను సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్రస్థాయిలో విజయదుందుబి మోగించాలి.

– గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఒలింపిక్ సంఘం కరీంనగర్ జిల్లా కార్యదర్శి,కప్ నిర్వాహక సభ్యుడు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- ఎస్పీకి సర్పంచ్‌ల వినతి



ఎస్పీని సన్మానిస్తున్న సర్పంచ్

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు గురువారం ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కోరారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండపురం బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్పీని ఘనంగా సన్మానించారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి కేటీఆర్ పర్యటన ఉన్న ప్రతిసారి అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అక్రమ అరెస్టులను ఆపాలని కోరారు.

ప్రజల భద్రతే లక్ష్యం

- స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రవికుమార్



మాట్లాడుతున్న డీఎస్పీ రవికుమార్

ఇల్లంతకుంట: ప్రజల రక్షణ, భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తోందని సిరిసిల్ల స్పెషల్ బ్రాంచి డీఎస్పీ రవికుమార్ అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేటలో గురువారం పోలీస్ సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. సరైన పత్రాలు లేని 43 ద్విచక్రవాహనాలు, ఆటో, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు నివాసముంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దన్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్, ఎస్సైలు రాజేశ్, మహేశ్, తదితరులున్నారు.

క్యాన్సర్ కాటేస్తోంది

- ప్రాణాలు తీస్తున్న మాయదారి క్యాన్సర్
- పెరిగిన అసంక్రమిత వ్యాధులు
- ఆహార అలవాట్లే ప్రధాన కారణమంటున్న వైద్యులు
- ఏడాదిలో క్యాన్సర్‌తో 17 మంది మృతి
- రోడ్డున పడుతున్న కుటుంబాలు



మృతిచెందిన షాహిదాబేగం

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): క్యాన్సర్ కాటేస్తోంది. గుర్తించేలోపే ప్రాణాలు తీస్తోంది. ప్రధానంగా మహిళలు రొమ్ము క్యాన్సర్ బారినపడి మరణిస్తున్నారు. ఎన్నో కుటుంబాలు ఈ వ్యాధితో చిన్నాభిన్నమవుతున్నాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలు, 12 తండాలుండగా ప్రతి గ్రామంలో క్యాన్సర్ రోగులు రోజురోజుకూ పదుల సంఖ్యలో పెరుగుతున్నారు. ప్రతి వందమందిలో ఐదుగురు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ తాత్కాలిక ఉపశమనం పొందగానే వ్యాధిని నిర్ధారణ చేసుకోవడం లేదు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏడాదిలోనే 17 మంది మృత్యువాత పడ్డారు. కరీంనగర్, హైదరాబాద్ లాంటి పట్టణాలకు వెళ్లే సమయాల్లో అక్కడి వైద్యులు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయడంతో వ్యాధి బయటపడుతోంది. వ్యాధిని నిర్ధారించుకునే సమయానికి చివరి దశకు చేరుకోవడంతో కీమోథెరఫీ చేయించినా ఫలితం లేకుండా పోతోంది. ఈ వ్యాధికి నిరుపేదలే ఎక్కువగా గురువుతున్నారు. ఖరీదైన వైద్యం పొందలేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తూ చివరికి ప్రాణాలు కోల్పోతున్నారు. మండలంలో అన్నిగ్రామాల్లో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, మరణిస్తున్న వారి సంఖ్య గణాంకాలను దాటుతోంది.

ఆహార అలవాట్లే ప్రధాన కారణం..

మారిన జీవన శైలిలో ప్రధానంగా ఆహార అలవాట్లే క్యాన్సర్‌కు ప్రధాన కారణమని వైద్యులు చెప్తున్నారు. రోజు తీసుకునే ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం వంటివి క్యాన్సర్‌కు కారణమని తెలుపుతున్నారు.

- ఫాస్ట్‌ఫుడ్, మద్యం, ధూమపానంతో లివర్ క్యాన్సర్ వస్తుంది.
- ఫ్రిజ్‌లో ఉంచిన పదార్థాలను తినడంతో కిడ్నీ క్యాన్సర్ బారినపడుతున్నారు.
- మహిళలు పుట్టిన పిల్లలకు ఎక్కువరోజులు పాలు ఇవ్వడం, శారీరక శ్రమ లేకపోవడం, ఇతరత్రా కారణాలతో 20 శాతం మహిళలు క్యాన్సర్ బారినపడుతున్నారు.
- ఇటీవ బీపీ, షుగర్, క్యాన్సర్, మూత్రపిండాలు, కడుపునొప్పి, ఊపిరితిత్తుల వ్యాధులకు ఎంతోమంది గురవుతున్నారు.

అవగాహన కల్పించాలి..

మారిన పరిస్థితులు, ఆహార అలవాట్లపై వైద్య ఆరోగ్యశాఖతో పాటు ఇతర శాఖల అధికారులు గ్రామాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి. చిన్న వయస్సులోనే మహమ్మారితో మరణాలు సంభవిస్తుండగా ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దీనిపై ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసి వ్యాధి సంక్రమణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే కొంతవరకు ప్రయోజనం ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ప్రభుత్వం క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు ప్రత్యేక చికిత్స, మందులు అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి



క్యాన్సర్‌తో కళ్లముందే నలుగురు మృతిచెందారు. ఎనిమిది నెలల వ్యవధిలో ఈ వ్యాధితో మృతిచెందడంతో వారి కుటుంబాలు రోడ్డునపడ్డాయి. వ్యాధిని గుర్తించేలోపే ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. మహిళలు ఎక్కువశాతం క్యాన్సర్ బారినపడుతున్నారు. వ్యాధిపై వైద్యులు గ్రామాల్లో అవగాహన కల్పించాలి. ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి.

– కొత్తపల్లి వాణి, సర్పంచ్, బండలింగంపల్లి

చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలి..



ప్రస్తుతం ఆహారపు అలవాట్లు మారాయి. మద్యం, ధూమపానం, ఫాస్ట్‌ఫుడ్, చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలి. ఏడాదికోసారి అనారోగ్యంతో బాధపడేవారు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. శారీరక శ్రమతో పాటు అసంక్రమిత వ్యాధుల నియంత్రణలో జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళలు పిల్లలకు పరిమిత వ్యవధిలోనే పాలు పట్టాలి.

– బాబు, మండల వైద్యాధికారి, ఎల్లారెడ్డిపేట

రైతులను ఆదుకోవాలి



ముస్తాబాద్: రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అకాలవర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు రాములు, రాజిరెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదబీమాపై హర్షం



మాట్లాడుతున్న కంచర్ల అమరేందర్ గౌడ్

సిరిసిల్ల అర్బన్ : గీత కార్మికులకు రూ. 5 లక్షల ప్రమాద బీమా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ.. వృత్తిలో భాగంగా గాయపడి అంగవైకల్యం చెందితే బీమా అందించాలని కోరారు. దళితబంధు మాదిరిగా గౌడబంధు అమలుచేసి గీత కార్మికులను ఆదుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి లక్ష్మీనారాయణ, కోశాధికారి పదిరె బాలాగౌడ్, పాముల దేవయ్య, పులి రాజు, బుర్ర శ్రీనివాస్, శ్రీనివాస్, శ్రీధర్, బాబు, ప్రవీణ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మానాన్న మాట్లాడటం లేదని..

- మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

రామగుండం: అమ్మానాన్న తనతో మాట్లాడటం లేదని మనస్తాపం చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. రామగుండం ఎస్సై శరణ్య తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాలపల్లికి చెందిన బందారపు శ్రీనివాస్–అన్నపూర్ణ(43) దంపతుల కూతురు వివాహం ఏడాది క్రితం జరిగింది. పెళ్లిలో అన్నపూర్ణ అత్తింటివారికి, తల్లిగారింటివారికి గొడవ జరిగింది. అప్పటినుంచి అన్నపూర్ణ తల్లిదండ్రులు ఆమెతో మాట్లాడటం మానేశారు. ఈ విషయంలో ఆమె తీవ్ర మనోవేదనకు గురవుతోంది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం అన్నపూర్ణ కూతురుకు బాబు జన్మించగా భర్త తరఫు బంధువులు వచ్చారు. తల్లిగారింటి నుంచి ఎవరూ రాకపోగా కనీసం ఫోన్‌లోనూ మాట్లాడలేదు. దీంతో మనస్తాపం చెందిన అన్నపూర్ణ బుధవారం అర్ధరాత్రి ఇంటి పక్కనే ఉన్న బావిలో దూకి, ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రామగుండం వాసి మృతదేహం లభ్యం

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గురువారం ఓ వ్యక్తి మృతదేహం లభించింది. బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్ తె లిపిన వివరాల ప్రకారం.. రైల్వే బ్రిడ్జి వద్ద కుళ్లిన మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు దాదాపు 15 రోజుల క్రితమే మరణించినట్లుగా ఉందని, అక్కడ లభించిన ఆధారాలనుబట్టి రామగుండంకు చెందిన బండి వెంకటేశ్వర్లుగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. వెంకటేశ్వర్లు కొన్నేళ్లుగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని, ఎండదెబ్బ కారణంగా చనిపోయి ఉంటాడని పేర్కొన్నారు. పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

వ్యాన్ బోల్తా..

గొల్లపల్లి : ధాన్యం లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ బోల్తాపడింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చెందోళి పీఏసీఎస్ పరిధిలోని చిల్వకోడూర్ కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ గురువారం దట్నూర్ బస్టాండ్ సమీపంలో మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న ధాన్యం బస్తాలు రోడ్డు పక్కనే ఉన్న కాలువలో పడిపోయాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనిల్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట మాధవరావు ఘటనా స్థలానికి చేరుకొని ధాన్యం బస్తాలను మరో లారీలో తరలించినట్లు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

గొల్లపల్లి: మండలంలోని గోవిందుపల్లి గ్రామానికి చెందిన గుర్రం మల్లవ్వ (65) బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మల్లవ్వ కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చేర్పించినా నయం కాలేదు. జీవితంపై విరక్తి చెంది గురువారం గ్రామంలో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గాలించగా బావిలో మృతదేహం కనిపించింది. మృతురాలి భర్త హన్మాండ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన అంత్యక్రియలు

మేడిపెల్లి : కొడిమ్యాల మండలం.. కోనాపూర్ గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందగా గురువారం అంత్యక్రియలను స్వగ్రామాల్లో నిర్వహించారు. భీమారం మండల కేంద్రానికి చెందిన మోహిన్ ఖాన్ తండ్రి మహమూద్ చిరువ్యాపారి కాగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. డిగ్రీ చదువుతున్న ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాగోజీపేటకు చెందిన మల్లయ్య కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్ మధ్యలోనే మానేసిన కుమారుడు గోకుల అభిషేక్ చేదోడువాదోడుగా ఉంటాడుకున్న తరుణంలో ప్రమాదంలో మృతిచెందడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. మేడిపెల్లికి చెందిన బొంగోని వరుణ్ సందేశ్ ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాశారు. తండ్రి ఉపాధికోసం గల్ఫ్‌కు వెళ్లి ఇటీవలే తిరిగివచ్చాడు. వరుణ్ మృతి ఆ కుటుంబంలో తీరనిలోటు మిగిల్చింది.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మల్లాపూర్ : అకాలవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని టీడీపీ జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ మానుక ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని రాఘవపేట, ముత్యంపేట గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. టీడీపీ నాయకులు కట్టకొల వెంకటేశ్, ఎండీ.సాదుల్లా, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని ఇందిరానగర్ వద్ద రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ద్విచక్రవాహనంపై వెళ్తున్న కరీంనగర్ ముకరంపురకు చెందిన మీర్జా హఫీజ్ అలీ బేగ్(56)ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు.